నాలుగు రోడ్ల కూడలిలో నరకయాతన

పట్టణంలో ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు విసిగిపోతున్నారు. నాలుగు రోడ్ల కూడలి దాటాలంటే.. ఓపిక ఉండాల్సిందే మరి. రద్దీ ఎక్కువగా ఉండడం, ఆటోలు అక్కడే పార్కింగ్ చేయడం, రోడ్లపై విక్రయాలు ఇలా అన్నీ వెరసి ప్రయాణికులకు నరకయాతన పెడుతున్నాయి. కాలినడకన వెళ్లే వారికి దారి దొరకని పరిస్థితి. రద్దీ ఉన్న సమయంలోనైనా పోలీసులు చొరవ తీసుకుని ట్రాఫిక్‌పై శ్రద్ధ చూపితే తమకు వెసులుబాటు ఉంటుందని ప్రయాణికులు చెబుతున్నారు.

- అడ్డ దిడ్డంగా వాహనాల రాకపోకలు
- 500 మీటర్ల ప్రయాణం 15 నిమిషాలు


నాలుగు రోడ్ల కూడలిలో అడ్డ దిడ్డంగా వెళ్తున్న వాహనాలు

బద్వేల్ (వ్యవసాయం): బద్వేల్ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ఓ వైపు నెల్లూరు ప్రధాన రహదారి.. మరో వైపు కడప–తిరుపతి, మైదుకూరు–కర్నూలు రహదారులు ఉన్నాయి. దీనికి తోడు ఈ మార్గంలోనే క్రిష్ణపట్నం ఓడరేవుకు వెళ్లే లారీలు, టస్కర్లు, ఆయిల్ ట్యాంకర్లు తిరుగుతున్నాయి. వందల అక్కడే కూరగాయల మార్కెట్, పాత బద్వేల్‌కు దారులు ఉన్నాయి. ఈ కూడలి నుంచి 500 మీటర్ల దూర ప్రయాణం కూడా నరకయాతనను తలపిస్తోంది. పట్టణ రెవెన్యూ డివిజన్ కార్యాలయం రోడ్డు వెంట ఇసుకేస్తే రాలనంత రద్దీ కనిపిస్తోంది. జనం ఇంటికి వెళ్లేందుకు కాలయాపన చేయాల్సి వస్తోంది.

ఉదయం వెళ్లలేకపోతున్నాం

ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకూ కూడలి నుంచి ఎ– రోడ్డు వైపు వెళ్లలేకపోతున్నాం. కాలినడకన వెళ్దామన్నా ఏ వైపు నుంచి వాహనం వచ్చి ఢీకొడుతుందోనని భయం. జనాభా పెరిగే కొద్దీ రహదారులను విస్తరించాల్సిన అవసరం ఉంది. అయితే ఇక్కడ మాత్రం రోజు రోజుకూ కుదించుకుపోతోంది.

– జయరామిరెడ్డి గాంధీనగర్, బద్వేల్

ట్రాఫిక్‌ను నియంత్రించడం లేదు

అడ్డ దిడ్డంగా వెళ్లితే ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటారనే భయం అసలే లేదు. అందుకే వాహన దారులు వారికి ఇష్టం వచ్చినట్లు వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆటోలు ఎక్కడ పడితే అక్కడ ఆపడంతో వచ్చే పోయే వాహనాలకు చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

– జయరాములు,
మార్కెట్ యార్డు వీధి, బద్వేల్

సమస్యలు ఇవీ..

- బద్వేల్ పట్టణానికి వివిధ గ్రామాల నుంచి ఆటోలు నడుపుతున్నారు. వీరికి పార్కింగ్‌కు స్థలం కేటాయించలేదు. దీంతో వారు రోడ్ల పైనే ఆటోలు నిలపాల్సి వస్తోంది. ఆర్టీసీ బస్సులు భారీ వాహనాలు వచ్చినప్పుడు ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఆటోలు అడ్డుగా ఉండడంతో ఉదయం పాఠశాలకు పిల్లలను తీసుకెళ్లే తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- ప్రధాన రహదారిపై స్థలాన్ని పది అడుగుల మేర ఆక్రమించి కొందరు వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో చిన్న చిన్న వ్యాపారులు అక్కడ బండ్లు పెట్టుకున్నా.. ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ వాహనాలకు అంతరాయం ఏర్పడుతోందంటూ విరుచుకుపడుతున్నారు.
- నాలుగు రోడ్ల కూడలి నుంచి ఎ–రోడ్డు వైపునకు అర కిలోమీటరు ప్రయాణం చేయాలంటే 15 నిమిషాలకు పైగా పడుతోంది. ఓర్పు, సహనం లేకపోతే ఏ ప్రమాదమైనా జరిగే అవకాశం ఉంది. ఏ వాహనం ఎటు నుంచి దూసుకువస్తుందోనని ఈ మార్గంలో వాహనదారులు భయం భయంగానే ప్రయాణం చేయాల్సి వస్తోంది.

బీసీల సంక్షేమానికి కృషి చేస్తా

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్


మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి, తదితరులతో ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్: బీసీల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రమేష్‌యాదవ్ అన్నారు. పులివెందులలోని పార్టీ కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదివారం కలిశారు. రమేష్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలందరినీ ఏకంచేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనను బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమించినందుకు ఎంపీ అవినాష్‌రెడ్డిని శాలువతో సత్కరించారు.

మరియన్న సేవలు అభినందనీయం

సెయింట్ జోసెఫ్ పాఠశాల రికార్డు అసిస్టెంట్ కొత్తపల్లి మరియన్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ ఆర్.రమేష్‌యాదవ్ అన్నారు. స్థానిక సెయింట్ జోసెఫ్ పాఠశాలలో మరియన్న పదవీ విరమణ, పుట్టినరోజు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆయనను శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు.

క్లుప్తంగా

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం


విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ, నిర్వాహకులు

బద్వేలు అర్బన్: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అర్బన్ ఎస్‌ఐ జె.రవికుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని సురేంద్ర నగర్‌లో మమ్మే ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వయోజన విద్యా కేంద్రాల ప్రారంభ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరినీ అక్షరాస్యులుగా మార్చి సమాజంలో మార్పునకు శ్రీకారం చుట్టడం గొప్ప విషయమన్నారు. అనంతరం విద్యా కేంద్రాల ఉపాధ్యాయులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు.మీ కార్యక్రమంలో పీఓ డాక్టర్ సుందరం, జింకా శాంతమ్మ, విద్యా కేంద్రాల ఉపాధ్యాయులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

మైదుకూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 3న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, స్కిల్ హబ్ ఇన్‌చార్జి ఎం.రాధారామ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సీడప్, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో జరిగే ఈ మేళాకు ఎయిల్ డిక్షన్, ముత్తూట్ ఫైనాన్స్, నవత ట్రాన్స్‌పోర్ట్, అభి గ్రీన్ టెక్నాలజీస్, అమరరాజ గ్రూప్ కంపెనీలు వస్తున్నాయని వారు పేర్కొన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లమా, బీటెక్ చదివిన వారితోపాటు అనుభవం ఉన్న డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9398348760, 9701801902 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

నైతికతే నిజమైన స్వేచ్ఛ

ప్రొద్దుటూరు కల్చరల్: నైతికతే నిజమైన స్వేచ్ఛ అని జమా అతె ఇస్లామీ హింద్ మహిళా జిల్లా అధ్యక్షురాలు రెహనా, పట్టణాధ్యక్షురాలు హసీనా అన్నారు. ఈ నెల 30 వరకు జరుగనున్న దేశ వ్యాప్త జాగృతి ఉద్యమం పోస్టర్లను మండల పరిధిలోని ఖాదరబాద్ మదరసాలో ఆదివారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మితి మీరిన స్వేచ్ఛ అనర్థాలకు దారితీస్తుందన్నారు. ఈ విషయమై విద్యార్థులు, ప్రజలకు వివరిస్తూ జాగృతం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ కన్వీనర్ అయేషా, మహబూబ్‌చాన్, గులాబ్‌జాన్, అయిషాకౌసర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలి

ప్రొద్దుటూరు కల్చరల్: తైక్వాండో క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయవేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి అన్నారు. స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఆగ్రాలో జరిగే క్రీడలకు వెళ్లే ఏడుగురు క్రీడాకారులకు ఆయన ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాధవరెడ్డి, మధుసూదన్, గంగాధర్, తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి నాయబ్‌రసూల్, సలీం పాల్గొన్నారు.

గుండెపోటుతో బ్యాంకు మేనేజర్ మృతి


సత్యనారాయణ (ఫైల్)

కాశినాయన: మండలంలోని నరసాపురం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ పి.సత్యనారాయణ (59) శనివారం రాత్రి మృతి చెందారు. శనివారం బ్యాంకులో విధులు ముగించుకుని ఆర్టీసీ బస్సులో బద్వేల్‌కు వెళ్లారు. బస్సులోనే గుండెపోటు రావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు సత్యనారాయణకు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి


మాట్లాడుతున్న నాయకులు

బ్రహ్మంగారిమఠం: గుడ్లవల్లేరులో జరిగిన సీసీ కెమేరాల సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ నాయకులు జగదీష్, నాగరాజు డిమాండ్ చేశారు. మండలంలోని బి.మఠంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థినులు వారం రోజుల క్రితమే సమస్య తెలిపినా యాజమాన్యం చొరవ చూప లేదని అన్నారు. వాష్ రూంలో హిడెన్ కెమేరాలు ఏర్పాటు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సేల్స్‌మెన్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న మద్యం దుకాణాల సేల్స్‌మెన్స్, సూపర్ వైజర్స్

ప్రొద్దుటూరు: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ సేల్స్ మెన్స్, సూపర్ వైజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు నవీన్‌రాజ్, శ్రీనివాసులు, శివ, సురేష్, డిపాల్, భాస్కర్‌రెడ్డి, బాల వెంకటయ్య, రాజశేఖర్ డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరులోని ఆ శాఖ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం నుంచి మైదుకూరు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ మద్యం దుకాణాల్లో పనిచేసేందుకు సేల్స్ మెన్స్, సూపర్ వైజర్స్‌గా తమను నియమించారన్నారు. ప్రస్తుతం తమతో ప్రభుత్వానికి పనిలేదని మంత్రి కొల్లు రవీంద్ర చెప్పడం తగదన్నారు. ఈ విషయంపై సీఎం, డిప్యూటీ సీఎం, ఎక్సైజ్ శాఖ మంత్రి స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. వీరికి ప్రగతిశీల కార్మికుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సృజన శ్రీను, మాలమహానాడు ఏపీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు మురళీప్రసాద్ మద్దతు పలికారు.

జీఓ 177ను వెంటనే రద్దు చేయాలి


మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున

ప్రొద్దుటూరు: జీఓ నంబర్–77ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున డిమాండ్ చేశారు. స్థానిక ఏబీవీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో యువగళం పాదయాత్ర చేస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రైవేటు కళాశాలలో పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వర్తించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికీ పాత జీఓ రద్దు చేయకపోవడం దారుణం అన్నారు. కలికిరి జేఎన్‌టీయూలో ర్యాగింగ్‌కు ఓ విద్యార్థి బలి కావడం బాధాకరమని తెలిపారు. కలికిరి జేఎన్‌టీయూలో ర్యాగింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో హిడెన్ కెమెరా ఉదంతాన్ని విచారించి నిందితులను శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ ప్రొద్దుటూరు భాగ్ కన్వీనర్ శరణ్ కుమార్, నగర కార్యదర్శి శివ నారాయణ, సాయిఅభినయ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్నే అమలుచేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

ప్రొద్దుటూరు : రాష్ట్రంలో ప్రస్తుతం 3 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు సీపీఎస్ విధానంలో ఉన్నారని, వారందరికి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాల్సిందేనని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి కోరారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు పదవీ విరమణ అనంతరం కనీస భద్రత లేకుండా పోయిందన్నారు. సీపీఎస్ విధానంపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా యూనిఫైడ్ పెన్షన్ స్కీం తీసుకురావడాన్ని ఏపీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, సుబ్బయ్య, సయ్యద్ బాషా, నరసింహకుమార్, గోవర్ధన్‌రెడ్డి, మల్లికార్జున, అప్సర్‌పాషా, విష్ణువర్ధన్, సురేష్, రామసుధాకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, రామచంద్రారెడ్డి, సుధాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని, దానికి మరో ప్రత్యామ్నాయం అంగీకరించమని పోరుమామిళ్ల రీజియన్ ఏపీటీఎఫ్(257) నాయకులు సత్తార్, వెంకటరామిరెడ్డి, ఆదిశేషారెడ్డి, అన్వర్‌బాషా, శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆదివారం వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం స్టేట్ కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్యారెంటీ లేని సీపీయస్, జీపీఎస్, యూపీఎస్ పథకాలు అంగీకరించమన్నారు. ఉపాధ్యాయులు జీవిత చరమాంకంలో ఆందోళన చెందకుండా ఉండాలంటే పాత పింఛన్ విధానం తోడ్పాటు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న ఏపీటీఎఫ్(257) నాయకులు

నేడు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి

ప్రొద్దుటూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి సోమవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని అన్వర్ థియేటర్ ఎదురుగా ఉన్న వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోమవారం పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

వృద్ధులకు అన్నదానం


వృద్ధులకు అన్నదానం చేస్తున్న రామమోహన్‌రెడ్డి, తదితరులు

పోరుమామిళ్ల: తన పుట్టినరోజు సందర్భంగా స్థానిక వివేకానంద సేవాశ్రమంలో వృద్ధులకు పోరుమామిళ్లకు చెందిన ఎం.రామమోహన్‌రెడ్డి ఆదివారం అన్నదానం చేశారు. పుట్టిన రోజు పార్టీల పేరుతో వేల రూపాయలు ఫంక్షన్లకు వెచ్చించే బదులు అనాథలకు అన్నం పెట్టడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్రరెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

డికేటీ పట్టాను రిజిష్టర్ చేశారు



మాట్లాడుతున్న జయరాజు

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రభుత్వం ఇచ్చిన డీకేటీ పట్టాను 2021లో అప్పటి సబ్ రిజిస్ట్రార్ విద్యాసాగర్‌రెడ్డి తప్పుడు సర్వే నెంబర్‌తో రిజిష్టర్ చేశారని రాజుపాళెం మండలం తొండలదిన్నెకు చెందిన సింహం జయ రాజ్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2007–08లో ప్రభుత్వం తన తల్లి సింహం సునీతకు సర్వే నెంబర్109/(ఏ)లో నాలుగు సెంట్ల డీకేటీ పట్టా మంజూరు చేసిందన్నారు. ఆ ప్లాట్‌లో ఇల్లు నిర్మించుకున్నామని, అయితే అప్పటి సబ్ రిజిస్ట్రార్ విద్యాసాగర్‌రెడ్డి గ్రామ చివర ఉన్న పొలం సర్వేనంబర్ 102/1(బి)తో ఎం.భాస్కర్, ఆయన కుమార్తె అయిన చిన్నరంగమ్మకు తప్పుడు రిజిష్టర్ చేశారని తెలిపారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఉన్నతాధికారులను కోరారు.

విశ్వేశ్వరునికి విశేష పూజలు

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో కాశీ విశ్వేశ్వరునికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూలమూర్తికి సామూహికంగా భక్తులు పంచామృతాభిషేకం నిర్వహించారు. అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య తెల్లవారుజామున భక్తులు శుద్ధ జలం, క్షీరం, నారికేళ జలంతో అభిషేకం చేశారు.

వైభవం.. శివపార్వతుల కల్యాణం


కల్యాణోత్సవంలో గంగా రాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్: ఆరుద్ర నక్షత్ర పర్వదినం సందర్భంగా స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి, రాజరాజేశ్వరి అమ్మ వారి మూల విరాట్‌లకు విశేష పూజలు జరిపారు. వేకువజామున స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజ రాజేశ్వరీ అమ్మవారికి కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గోపూజ, గణపతి, నవగ్రహ, రుద్రహోమం, మృత్యుంజయ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగా రాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవమూర్తులను అలంకరించి కళ్యాణ వేదికపై ఆశీనులను చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య వైభవోపేతంగా కల్యాణం జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మెన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో చెత్తా చెదారం తొలగింపు


పాఠశాల వద్ద దోజర్‌తో శుభ్రం చేయిస్తున్న ఎస్‌ఐ వెంకటరమణ


పిచ్చిమొక్కలను కాల్చివేస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

రాజుపాళెం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు, మట్టి కుప్పలను రాజుపాళెం ఎస్‌ఐ కత్తి వెంకటరమణ ఆధ్వర్యంలో ఆదివారం శుభ్రం చేయించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. వర్షాకాలం కావడంతో విష పురుగులు పాఠశాలల్లోకి రాకుండా పరిశుభ్రతా చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

అట్లూరు: వర్షాకాలం కావడంతో పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని ఎస్‌ఐ రామక్రిష్ణయ్య అన్నారు. మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాల, కళాశాల ఆవరణలో తమ సిబ్బందితో కలిసి పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం తొలగించారు. ఆయన మాట్లాడుతూ అపరిశుభ్రత ఉంటే అక్కడ మనిషి మనుగడపై దుష్ప్రభావం చూపుతుందన్నారు.

వెల్లాల పాత వంతెనపై రాకపోకలు బంద్


పాత వంతెనపై చేరిన వరద నీరు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పాత వంతెనపై ఆదివారం నుంచి రాకపోకలు నిలిపివేశారు. పైతట్టు ప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు మండలంలోని రాజోలి ఆనకట్టకు భారీగా చేరుతోంది. ఆదివారం పాత వంతెనపై నీరు ప్రవహించడంతో ఇరువైపులా వీఆర్‌ఏలు ముళ్లకంపలు అడ్డు వేసి రాకపోకలు నిలిపివేశారు. ఈ దారిలో వెళ్లే వాహనాలన్నీ హై లెవల్ వంతెనపై వెళ్లాలని సూచించారు.

ఎస్‌ఎస్‌వీ మొబైల్ దుకాణంలో చోరీ


దుకాణం పరిశీలిస్తున్న అర్బన్ సీఐ, ఎస్‌ఐలు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని సీఎస్‌ఐ చర్చి కాంప్లెక్స్ వద్ద ఓ మొబైల్ దుకాణంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. సుమిత్రా నగర్‌కు చెందిన మదుసూదన్ ఎస్‌ఎస్‌వీ మొబైల్స్ పేరుతో సెల్‌ఫోన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరే శనివారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం తన సమీప బంధువుల శుభకార్యం ఉండటంతో వెళ్ళి సాయంత్రం దుకాణానికి వచ్చి షటర్ తెరవగా దుకాణంలోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటం గమనించాడు. కిటికీ ఊచలు తొలగించి ఉండడంతో చోరీ జరిగినట్లు గ్రహించి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ రాజగోపాల్, ఎస్‌ఐ రవికుమార్‌లు పరిశీలించారు.

పుట్టపర్తి నారాయణాచార్యులుకు ఘన నివాళి


పుట్టపర్తి నారాయణాచార్యులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న హనుమంతరావు


నారాయణాచార్యులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్: పుట్టపర్తి నారాయణాచార్యుల వర్ధంతి సందర్భంగా ఆదివారం పుట్టపర్తి సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి పలువురు నివాళి అర్పించారు. పుట్టపర్తి సాహితీ పీఠం ప్రధానకార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 14 భాషల్లో పండితుడైన నారాయణాచార్యులు అందరికీ ఆదర్శనీయులన్నారు. శివతాండవ కావ్యం ఆయనకు ఎనలేని కీర్తి తెచ్చిందన్నారు. ఒంటేరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి నారాయణాచార్యులు రచించిన శివ తాండవం సంగీత, సాహిత్య, నాట్య, సంకేతాల కావ్యమన్నారు. అలాగే శివాలయంలోని పుట్టపర్తి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రవిశంకర్, అంకాల్ కొండయ్య, సాయికుమార్, గంగాధర్, వెంకట ప్రసాద్, ప్రభు కుమార్, మధు, సుధాకర్, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తన కావ్యాన్నే పాఠ్యపుస్తకంగా చదివారు

బద్వేలు అర్బన్: మాతృ భాషా ప్రేమికుడు పుట్టపర్తి నారాయణాచార్యులు అని మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు అన్నారు. పుట్టపర్తి నారాయణాచార్యులు వర్ధంతి సందర్భంగా ఆదివారం మొల్ల సాహితీ పీఠం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాను రచించిన కావ్యాన్నే తానే పాఠ్య పుస్తకంగా చదివి పరీక్ష రాసిన అరుదైన కవి నారాయణాచార్యులు అని శ్లాఘించారు. ఆయన రచనల్లో శివ తాండవం ఒక కళాఖండమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర నాటకమండలి ప్రధాన కార్యదర్శి మధుబాబు, అన్నమాచార్య ఇంజినీరింగ్ ప్రొఫెసర్లు ఆదిల్‌బాషా, వలి, విద్యార్థులు నందకిశోర్, మధుసూదన్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.